రేపు మహనీయుల విగ్రహావిష్కరణ

● చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిద్దాం

● టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపు

7

తుంగభద్రకు నీటి విడుదల



గతంలో కంప చెట్లతో ఉన్న చిత్రావతి గట్టు

సుందర చిత్రావతి

● వేగంగా సుందరీకరణ పనులు

పుట్టపర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా నడయాడిన చిత్రావతి నది ప్రాంతం అందంగా మారుతోంది. నదీ పరిసరాలు గతంలో కంపచెట్లు, చెత్తాచెదారంతో నిండి ఉండేది. అక్కడ ఉన్న అపరిశుభ్రతను చూసి పుణ్యస్నానాలు చేయడానికి వచ్చిన భక్తులు నొచ్చుకున్న సందర్భాలు కోకొల్లలు. గత ప్రభుత్వం చిత్రావతి నది సుందరీకరణకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో అది అధ్వానంగా మారింది. అయితే ఈఏడాది సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు జరగనుండటంతో చిత్రావతిని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పనులు చేపట్టింది. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చొరవ తీసుకుని చిత్రావతి సుందరీకరణకు నిధులు మంజూరు చేయించడమే కాకుండా, ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అధికారులతో సమీక్షిస్తున్నారు. దీంతో సుందరీకణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈక్రమంలో చిత్రావతి నది పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా మారాయి. సుందరీకరణ చేయడం వల్ల కాలుష్య నివారణతో పాటు భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి అనుకూలమైన పరిస్థితి ఏర్పడిందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కంపచెట్ల తొలగింపు తర్వాత శుభ్రంగా కనిపిస్తున్న చిత్రావతి ఒడ్డు

సొంతూరులో పరిశ్రమలు పెట్టండి

● యువతకు మంత్రి సవిత పిలుపు



ఎంఎస్ ఎంఈ పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సొంతూరులో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు యువత ముందుకు రావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పిలుపునిచ్చారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. పెనుకొండ సమీపంలోని రొద్దం రోడ్డులో రూ.7 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆమె శనివారం భూమిపూజ చేశారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని అన్నారు. పెనుకొండలో 68 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని, మొదటి విడతలో 20 ఎకరాల్లో రోడ్లు, కాలువలు తదితర మౌలిక సదుపాయాలకు రూ.7 కోట్లను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అన్నిరకాల అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. పరిశ్రమల విషయంలో వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం నాగమల్లీశ్వర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైకు

ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

అగళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని హిరియూరు వద్ద ముందు వెళుతున్న లారీని బైకు ఢీకొట్టడంతో అగళి మండలం బొమ్మరసనపల్లి గ్రామానికి చెందిన తనూజ్(20) మృతిచెందాడు. ఆర్జీపల్లి గ్రామానికి చెందిన అక్షయ్(20) తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరూ కర్ణాటకలోని మధుగిరిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీకి వెళుతున్నామని కుటుంబ సభ్యులకు తెలిపి, బైక్‌పై వీరు హిరియూరులోని మారికమ్మ డ్యాంను చూసేందుకు వెళ్లారు. మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. అక్షయ్‌ని దావణగెరె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీలు గాలికి..!

సరిహద్దును పట్టించుకోని రవాణా శాఖ.. నిబంధనలు పాటించని ట్రావెల్ బస్సులు

ప్రయాణికుల బస్సుల్లో వస్తు రవాణా

స్లీపర్ కోచ్‌లో

అత్యవసర ద్వారాలు ఏవీ..?

ఫిట్‌నెస్ లేకున్నా అడిగేవారు లేరు

ప్రమాదకరంగా హైవేపై ప్రయాణం

పుట్టపర్తి/హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో వాహనాల తనిఖీని రవాణా శాఖ అధికారులు గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో బెంగళూరు-హైదరాబాదు నడుమ జిల్లా మీదుగా ప్రయాణించే ప్రైవేటు బస్సుల భద్రతపై చర్చ జరుగుతోంది. ట్రావెల్స్ యజమానులు ప్రయాణికుల భద్రత గురించి పట్టించుకోవడం లేదని, వారి దృష్టి ఆదాయంపై మాత్రమే ఉందని పలువురు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుస్తున్నా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం, ఆ తరువాత మౌనం వహించడం పరిపాటిగా మారిందని అంటున్నారు. చాలా బస్సులకు ఫిట్‌నెస్ ఉండదని, అనుమతి లేకపోయినా యథేచ్ఛగా తిరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

సరుకు రవాణా..

ప్రైవేట్ ట్రావెల్ బస్సులలో ప్రయాణికులకంటే సరుకు రవాణా ఎక్కువగా జరుగుతోంది. బెంగళూరు, హైదరాబాదు నుంచి చాలా రకాల పరికరాలు, వస్తువులను ప్రైవేట్ బస్సుల్లో తరలిస్తున్నారు. తనిఖీలు ఉండవని, పన్ను ఎగవేసి జీరో బిజినెస్ చేయొచ్చని కొందరు వ్యాపారులు ప్రైవేటు బస్సులను సరుకు రవాణాకు ఎంచుకుంటున్నారు. ప్రయాణికులు తరలించే వాహనాల్లో వాణిజ్య సరుకులను తీసుకెళ్లకూడదు. ప్రయాణికుల లగేజీ మాత్రమే తీసుకెళ్లాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఈ దందా జరుగుతోంది. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఈ సరుకు కారణంగా ప్రమాద తీవ్రత పెరుగుతోంది.

కనిపించని అత్యవసర ద్వారాలు

కొన్ని ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో అత్యవసర ద్వారాలు కనిపించడంలేదని ప్రయాణికులు అంటున్నారు. స్లీపర్ బస్సుల్లో కింద కూర్చుని, పైన పడుకునే ఏర్పాట్లు ఉంటాయి. బస్సు లోపల అద్దాల చుట్టూ పరదాలు వేసి ఉంటారు. దీంతో అత్యవసర ద్వారాలు కనిపించే పరిస్థితి ఉండదు. దీంతో ప్రమాదాలు జరిగిన సమయంలో బయట పడేందుకు వీలు లేకుండా పోతోంది. అప్పటికప్పుడు అద్దాలను పగులగొడితేగానీ ప్రాణాలతో బయట పడటం లేదు. దీనికితోడు చాలా బస్సులకు సింగిల్ డ్రైవర్‌ను పంపుతున్నారు. రాత్రంతా ఒకరే డ్రైవింగ్ చేయడం కూడా ప్రమాదాలకు కారణం అవుతోంది.

జిల్లాలో 99 కి.మీ. పరిధి..

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి జిల్లాలో 99 కి.మీ. ఉంది. చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు నుంచి రాప్తాడు వరకు జిల్లా పరిధి ఉంది. బెంగళూరు నుంచి వచ్చే బస్సులను కొడికొండ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. సరిహద్దుల్లో కట్టడి చేస్తే హైదరాబాదు వరకూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించే వీలు ఉంటుంది. ఇంతటి కీలకమైన బాధ్యతలను జిల్లా రవాణా శాఖ అధికారులు విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



పెనుకొండలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వద్ద తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

తరచూ తనిఖీలు..

జిల్లా నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్ బస్సులు, బెంగళూరు, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే బస్సులను తరచూ తనిఖీ చేస్తుంటాం. తనిఖీలు మా విధుల్లో ఒక భాగం. కొన్ని సందర్భాల్లో రాత్రిపూట, మరికొన్ని సందర్భాల్లో ఉదయం బస్సులను తనిఖీ చేసి, నిబంధనలు పాటించాలని హెచ్చరికలు జారీచేస్తున్నాం. పెనుకొండ వద్ద శనివారం కూడా ట్రావెల్ బస్సులను తనిఖీలు చేశాం.

- కరుణాసాగర్ రెడ్డి, ఆర్టీఓ, హిందూపురం

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

● కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న నాలుగురోజులు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన జిల్లాస్థాయి అధికారులు, ఆర్డీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు మండల అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శిథిల భవనాలు, పాఠశాలలు, చెరువులు, వాగులు, వంతెనలు వద్ద ప్రమాద సూచకలు ఏర్పాటు చేయాలన్నారు. పంటనష్టం, పశువుల ప్రాణనష్టం లేకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వో, వీఆర్ఏలను అప్రమత్తం చేయాలన్నారు. ఆరోగ్యశాఖ వారు మందుల నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని, విద్యుత్ కమ్యూనికేషన్, తాగునీటి సరఫరా అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, డివిజన్, ప్రతి మండల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. అన్ని టెలీకాం ఆపరేటర్లను సంప్రదించి, నెట్‌వర్క్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

పోలీసులు గట్టిగా పనిచేయాలి

● ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు పోలీసులు గట్టిగా పనిచేయాలని ఎస్పీ సతీష్ కుమార్ సూచించారు. పుట్టపర్తి సాయి ఆరామంలో శనివారం జిల్లాస్థాయి నేర సమీక్ష నిర్వహించారు. నేరస్థులకు శిక్ష పడితేనే ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందని, నేరాలు చేసేవారు భయపడతారని అన్నారు. మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, చోరీలు, మత్తు పదార్థాల అక్రమ రవాణ తదితరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానితులపై నిఘా పెట్టాలని సూచించారు. గ్రామ సందర్శనలు, పల్లెనిద్ర వంటి కార్యక్రమాలతో ప్రజలతో సన్నిహితంగా ఉండాలని సూచించారు. చిన్నారులపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యాసంస్థల్లో అవగాహన కార్యాక్రమాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేసుల ఛేదింపుల్లో ప్రతిభ కనపరిచిన సీఐలు, ఎస్ఐలు, ఎస్ఓజీ టీం సభ్యులకు ఎస్పీ ప్రశంసా పత్రాలను, నగదు రివార్డులను అందజేశారు. పోక్సో కేసులలో విజయం సాధించిన పీపీ లక్ష్మీనారాయణను సత్కరించారు. కేసుల విచాణలో చురుకుగా వ్యవహరించిన సీఐ ఇస్మాయిల్‌కు ప్రశంసాపత్రాన్ని అందచేశారు. సమావేశంలో ఏడీడీ, పీపీలు రాంనాయక్, లక్ష్మీనారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేశ్, హేమంత్‌కుమార్, నరసింగప్ప, శివన్నారాయణస్వామి, ఆదినారాయణ, ఎస్సీ సీఐ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో..?

విద్యుత్‌శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత.. జిల్లాలో 589 పోస్టులు ఖాళీ

● సమయానికి సేవలు అందక ఇబ్బందులు ● అదనపు పనిభారంతో అవస్థలు పడుతున్న సిబ్బంది

కొత్తచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. దాదాపు రెండు దశాబ్దాల నుంచి లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈ తదితర పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 589 పోస్టులు ఖాళీ ఉండటంతో విద్యుత్ సమస్యలు పరిష్కారంకాక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లను రోజువారి కూలీలుగా నియమించుకుని పనలుఉ చేయిస్తుండటంతో కొన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రోజురోజుకు విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నా అందుకు తగిన స్థాయిలో సిబ్బంది నియామకం జరగకపోవడంతో ఉన్న సిబ్బంది ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరే చేస్తూ తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తచెరువులోని విద్యుత్ సబ్‌స్టేషన్



సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

నిబంధనల మేరకు ఉండాల్సిన సిబ్బంది ఇలా...

జిల్లాలో హిందూపురం, కదిరి, పుట్టపర్తి మూడు విద్యుత్ డివిజన్‌లు ఉన్నాయి. విద్యుత్‌శాఖ నిబంధనల మేరకు ఒక్కో డివిజన్ పరిధిలోని ప్రతి 1500 సర్వీసులకు ఒక జూనియర్ లైన్‌మన్ ఉండాలి. ప్రతి 3 వేల కనెక్షన్లకు అసిస్టెంట్ లైన్‌మన్, 4,500 సర్వీసులకు లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. జిల్లాలో గృహాల కనెక్షన్లు 5,07,756, వాణిజ్య సముదాయ సర్వీసులు 50,626, పరిశ్రమలు 8,318, ప్రభుత్వ వాటర్‌వర్క్స్, వీధిదీపాలకు సంబంధించిన కనెక్షన్లు 13,693 ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు 1,32,430 ఉన్నాయి. అయితే వీటన్నింటి నిర్వహణకు సరిపడా సిబ్బంది జిల్లాలో లేరు. ఉన్న సిబ్బందే కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, మొండి బకాయిల వసూలు, మరమ్మతు పనుల్లో నిమగ్నమవుతున్నారు. సిబ్బంది కొరతతో రైతులకు తగిన సమయంలో సేవలు అందడం లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ బావులు, బోర్ల వద్ద రాత్రిపూట ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజులు పోతే రైతులే వేసుకుంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలోని మూడు డివిజన్లకు విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం మెత్తం 1525 మంది సిబ్బంది ఉండాలి. అయితే 936 మంది మాత్రమే ఉన్నారని 589 వివిధ పోస్టులకు సంబంధించి ఖాళీలు ఉన్నాయని ఆ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం: సంపత్‌కుమార్, ఎస్ఈ

జిల్లాలో విద్యుత్ సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. ఉన్న సిబ్బందితో విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తున్నాం. జిల్లాలో అన్నిరకాల పోస్టులు కలిపి 589ఖాళీ ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. సిబ్బంది కొరత వల్ల ఉన్న సిబ్బంది పై పని ఒత్తిడి పెరిగింది. వర్షాకాలం కావడంతో చాలా జాగ్రత్తలు తీసుకుంటు న్నాం. ప్రజలు, రైతులకు విద్యుత్ ప్రమాదాలపై సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

జిల్లాలో విద్యుత్‌శాఖలో సిబ్బంది వివరాలు ఇలా

పోస్టు	ఉండాల్సిన సిబ్బంది	ఉన్న సిబ్బంది	ఖాళీలు
ఈఈ	7	6	1
డీఈ	18	14	4
ఏఈ	57	37	20
జేఈ	37	36	1
ఏఏఓ	5	4	1
జేఏఓ	23	20	3
ఎస్ఆర్. ఎఎస్ఎస్‌టీ	70	64	6
జేఆర్. ఎఎస్ఎస్‌టీ	93	67	26
ఓఎస్	45	42	3
ఎఫ్ఎం గ్రేడ్.1	3	2	1
ఎస్ఎల్ఐ	6	5	1
లైన్‌ఇన్‌స్పెక్టర్లు	67	59	8
లైన్‌మెను	271	210	61
లైన్‌మెన్లు డ్రైవర్	6	0	6
అసిస్టెంట్ లైన్‌మెన్లు	269	24	245
జూనియర్ లైన్‌మెన్లు	183	5	178
వాచ్‌మెన్లు	24	18	6
స్వీపర్ కం గార్డినర్	21	17	4
జేఎల్ఎం గ్రేడ్.2	310	296	14

పోలీసు సిబ్బందికి వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పోలీసు సిబ్బంది, పిల్లలకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలను శనివారం నిర్వహించారు. మహిళలు, పిల్లలను లైంగిక దాడుల నుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర అంశాలపై పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలను ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం

● మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికే తమ ప్రాధాన్యం అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో శనివారం ఆయన సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 25 మంది రోగులను సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో చికిత్స కోసం బెంగళూరులోని వైదేహి ఆస్పత్రికి ప్రత్యేక బస్సు ద్వారా పంపించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోగులకు శస్త్రచికిత్స ఖర్చులు సహా అన్ని వైద్యసదుపాయాలను సంస్కృతి సేవా సమితి ట్రస్టు భరిస్తుందన్నారు. అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. అనంతరం 56 మందికి రూ.61.55లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైదేహి ఆస్పత్రి వైద్యులు లోకేశ్, భరణి, శ్రేయాస్, సుచేంద్ర, నర్సింగ్ స్టాఫ్ సంకేష్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.



శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారిని బెంగళూరుకు తీసుకెళ్తున్న బస్సుకు జెండా ఊపుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

క్రైం కార్నర్

రైతు ఆత్మహత్య


సానే అశోక్‌రెడ్డి (ఫైల్)

నల్లమాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన సానే అశోక్‌రెడ్డి (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాయికుమార్‌రెడ్డి తెలిపిన మేరకు అశోక్‌రెడ్డి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, పొలాలు, పంట సాగు కోసం రూ. 2లక్షలు అప్పు చేశాడని, ఆ అప్పును ఎలా తీర్చేదంటూ తరచూ మథనపడేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తన ఇంటి సమీపంలో ఉన్న గొర్లదొడ్డిలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గొర్లదొడ్డి వైపు వెళ్లి చూడగా అపస్మారస్థితిలో కనిపించాడు. వారు వెంటనే నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య కమలమ్మ, ఒక కుమారుడు ఉన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..


తలారి రామన్న(ఫైల్)

పరిగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరేకోళం గ్రామానికి చెందిన తలారి రామన్న(79) చెరువులోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. రామన్న గత కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఆస్పత్రుల్లో చూపించనా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించగా శనివారం ఉదయం చెరువులో శవమై కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంట్లో చోరీ

శింగనమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోదనపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రైతు జానకొండ నాగభూషణ శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి పైన ఉన్న గదిలో భార్య, పిల్లలతో కలిసి నిద్రపోయాడు. ఇది గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంటిలో జొరబడ్డారు. కనిపించిన ట్రంకు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఉదయం లేచిన నాగభూషణకు ఇంటి తాళం పగులగొట్టి ఉండటం, ట్రంకు పెట్టె కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రంకు పెట్టెలో 8 తులాల బంగారం నగలు, రూ.50వేలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ విజయ్‌కుమార్, ట్రైనీ ఎస్‌ఐ దయసాగర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని, డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం

విడపనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుంకులమ్మ గుడి వీధి ఎస్సీ కాలనీకి చెందిన అంజినమ్మ 20 రోజులుగా కనిపించటం లేదని ఆమె కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు విడపనకల్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు అంజినమ్మ మండలకేంద్రంలోని ఓ హోటల్‌లో పని చేసేది. దసర పండుగకు బళ్లారిలో ఉంటున్న కుమారుడు వెంకటేష్ వద్దకు వెళ్తున్నట్లు హోటల్‌లో చెప్పి బయల్దేరింది. అయితే అంజినమ్మ కొడుకు వద్దకు వెళ్లలేదు. ఈ నెల 2న ఆమె పని చేస్తున్న హోటల్ యజమానులు ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావ్ అడగగా తాను ఇల్లూరులోని తన కుమార్తె వద్దకు వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఇక అప్పటి నుంచి సెల్ స్విచ్ఛాఫ్ వస్తోందని, అన్ని చోట్లా గాలించినా ఫలితం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాపర్ వైరు చోరీచేసే ముఠా అరెస్ట్

● నిందితులందరూ అమలాపురం వారే


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీకాంత్, ఇతర అధికారులు

అనంతపురం క్రైం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బీఎస్‌ఎన్‌కు చెందిన కాపర్ కేబుల్‌ను చోరీ చేసిన దొంగల ముఠాలో 12మందిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 40 వేల విలువైన రాగి వైరు, ఒక ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సీఐ శ్రీకాంత్ యాదవ్ స్టేషన్‌లో శనివారం రాత్రి వెల్లడించారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ముందు భూమిలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ చోరీ చేసిన దొంగలను పట్టుకోవాలంటూ బీఎస్‌ఎన్‌ఎల్ సబ్ డివిజనల్ ఆఫీసర్ గంగాధర్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో లభించిన చిన్న ఆధారాన్ని పట్టుకుని దర్యాప్తులో ముందుకెళ్లారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో నిందితులున్నట్టుగా సమాచారం రావడంతో వెళ్లి అరెస్టు చేశారు. అరెస్టైయిన నిందితులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. అరెస్టయిన వారిలో వేముల ఉదయ్‌భాస్కర్(25),వేముల ఏసుబాబు(28),వేముల శివనారాయణ(27), నక్కా తిరుమల శ్రీనివాసులు(21),వేముల వేంకటాద్రి(25), గుజ్జదుర్గారావు(35), గుజ్జశీను(30), గాలి రాజు(50), గాలి చంటి(28),వేముల సుబ్బరాజు(33), గుజ్జ సింహాద్రి(24), చల్లా దుర్గారావు(38) ఉన్నారు. ఈ కేసులో మొత్తం 17 మంది నిందితులున్నారని, మిగతా ఐదుగురిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

● తల్లి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు


డివైడర్‌ను ఢీకొన్న కారు

కనగానపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం దాదులూరు వద్ద జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. రామ్మోహన్ తన తల్లి రామాంజనమ్మతో(49) కలిసి బంధువుల పెళ్లికి బెంగళూరు వెళ్లాడు. తిరిగి శుక్రవారం రాత్రి తన కారులో తల్లితో కలిసి స్వగ్రామానికి బయల్దేరాడు. దాదులూరు వద్ద ఆవు అడ్డు రావడంతో సడన్‌గా బ్రేక్ వేసి పక్కకి తిప్పాడు. దీంతో రోడ్డు పక్కనున్న డివైడర్‌ను కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామాంజనమ్మ కారులోనే మృతి చెందారు. కారుకు ఉన్న బెలూన్ ఓపెన్ కావడంతో రామ్మోహన్ ప్రాణాలతో బయడపడ్డాడు. గాయపడ్డ రామ్మోహన్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన రామాంజినమ్మ

పాపంపేట వెనుక ప్రకాశ్‌రెడ్డి

● జగన్ దృష్టిలో పడేందుకు వివాదం సృష్టి
● మా కుటుంబానికి సంబంధం లేదు
● పరిష్కారం చూపుతాం.. బాధితులు బుధవారం రండి
● టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

అనంతపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాపంపేట భూ వివాదం వెనుక రాజకీయ నిరుద్యోగి ప్రకాష్ రెడ్డి కుట్ర ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. అందులో ఎవరూ పావులుగా మారొద్దని కోరారు. ఈ వివాదం గురించి శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అధికారులతో మాట్లాడి సమస్య గురించి తెలుసుకున్నానని, 930 ఎకరాల సమస్య అని ప్రజల్ని భయాందోళనకు గురి చేశారన్నారని అన్నారు. సమస్య కేవలం 20 ఎకరాలదేనని అన్నారు. అది కూడా కోర్టులో ఉందని అన్నారు. ప్రకాష్ రెడ్డి, మరికొందరు వైసీపీ నాయకులు ఈ వివాదాన్ని సృష్టించారని ఆరోపించారు. ప్రకాష్ రెడ్డిని ఇన్‌చార్జిగా కూడా తొలగిస్తారన్న ప్రచారం జరుగోందని, అందుకే లేని వివాదాన్ని సృష్టించి జగన్ రెడ్డి దృష్టిలో పడాలని చూస్తున్నారని అన్నారు. 'పదంతులను ఎవరూ నమ్మవద్దు. మీ ఇంటి జోలికి ఎవరూ రాలేరు. మీ మీద చేయి పడాలంటే మమ్మల్ని దాటి పోవాలి. పాపంపేటలో ఒక్క ఇంటి మీద చేయి పడినా అది మా ఇంటి మీద పడినట్లే.' అని అన్నారు. ఇది ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ వైపు నుంచి ఇస్తున్న మాట అని అన్నారు. విద్యారణ్య నగర్ భూ బాధితులు తమ వద్దకు వస్తే రూ.2 కోట్లకు 4.20 ఎకరాలు వచ్చేలా చూశామని అన్నారు. ఆ రోజు కూడా ప్రకాష్‌రెడ్డి తాను డబ్బు తీసుకున్నట్లు ప్రచారం చేశారని అన్నారు. ఇక్కడి బాధితులు ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కలిస్తే.. 'నాకు రిజిస్టర్ చేయండి.. నేను చూసుకుంటా' అని చెప్పలేదా అని ప్రశ్నించారు. పాపంపేట భూ వివాదంతో తమ కుటుంబానికి సంబంధం లేదని అన్నారు. ఇందులోకి తన పేరు లాగితే తాను బయటకొచ్చి మాట్లాడుతానని, తన సోదరుడు సిద్ధార్థ అయితే మాట్లాడరని ప్రకాశ్ రెడ్డి నిందలు వేశారని మండిపడ్డారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటామని అన్నారు. ప్రకాష్ రెడ్డి పాములా మారి, సొంత పార్టీ నాయకుల సొమ్ముతిని, ఆస్తులు లాక్కున్నాడని విమర్శించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

జగన్‌కు ఎంత వాటా ఇచ్చావ్?

పాపంపేట భూ వివాదంలో మంత్రి నారా లోకేశ్‌కు వాటాలు వెళ్లాయని ప్రకాష్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని శ్రీరామ్ అన్నారు. అందరూ ఆయనలాగా ఉండరని అన్నారు. అమ్మ డెయిరీ, ఆలమూరులో భూ కబ్జా, పాపంపేట తాగునీటి పైప్‌లైన్ గుడ్‌విల్, ప్రభుత్వ వైన్ షాపుల్లో కర్ణాటక మద్యం అమ్మకాలలో జగన్‌కు ఎంత వాటా ఇచ్చావు అని నిలదీశారు. ముత్యాలమ్మ ఆలయంలో అక్రమాల గురించి విచారణ చేయాలని తామే కోరుతామని అన్నారు. వైసీపీ హయాంలో తనకు గన్‌మెన్‌లను ఇచ్చింది తన రక్షణ కోసం కాదని, ప్రకాశ్ రెడ్డి రక్షణ కోసమేనని అన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలు త్వరలోనే బయటకొస్తాయని, అందులో ప్రకాశ్ రెడ్డి నిందుతుడిగా ఉంటాడని అన్నారు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు పాపంపేట వివాదాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు. ఈ వివాదంలో సుభాష్ రెడ్డి, శ్రీరాములు వైసీపీ వారేనని, కనగానపల్లిలో ప్రకాష్ రెడ్డి అనుచరుడి సొంత బావమరిది శ్రీరాములు అని అన్నారు. పాపంపేట వివాదాన్ని పెద్దదిగా చేసేందుకు ప్రకాశ్ రెడ్డి కొందరు జర్నలిస్టులతో మాట్లాడి, ప్రోత్సహించారని ఆరోపించారు. పాపంపేట వివాద పరిష్కారం కోసం బుధవారం తన వద్దకు రావాలని, తనను రమ్మన్నా వస్తానని శ్రీరామ్ అన్నారు. రాజకీయలకు అతీతంగా బాధితులు, పాపంపేట పెద్దలు కలసి ఒక నిర్ణయానికి రావాలని కోరారు. సమస్య కోర్టు పరిధిలో ఉందని, ఎలా ముందుకు వెళ్లాలో అధికారులతో మాట్లాడి సమాచారం తీసుకుంటామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదని, పాపంపేటలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వబోమని అన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షులు పాముదాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రేపు మహనీయుల విగ్రహావిష్కరణ

చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిద్దాం

టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపు

మడకశిర టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామం వద్ద ఈ నెల 27న బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చరిత్రలో ఈ కార్యక్రమం నిలిచిపోయేలా నిర్వహిద్దామని ఆయన టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలసి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎందరి జీవితాల్లోనో వెలుగు నింపిన బాబూ జగ్జీవన్‌రామ్, రాజ్యాంగాన్ని అందించి ఎందరికో స్ఫూర్తినిచ్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ప్రభుత్వ విప్‌లు, ఇద్దరు ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్యేలు కోడుమూరు దస్తగిరి, విజయ్‌చంద్ర, మురళీమోహన్, సోంగా రోషన్‌కుమార్, శ్రీనివాసరావు, జయసూర్య, శ్రీధర్, విజయ, శ్రావణి, నందిగామ సౌమ్య, వెంకటరాజు, కుమార్ రాజవర్మ, సత్యనారాయణ, డాక్టర్ వీఎం థామస్, రామాంజనేయులు తదితరులు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ హాజరవుతారని తెలిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం: ఎమ్మెల్యే


నీటిని విడుదల చేయిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

పెద్దపప్పూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చాగల్లు రిజర్వాయర్ నుంచి శనివారం పెండేకల్లు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జలహారతినిచ్చి నీటిని విడుదల చేశా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా చాగల్లు రిజర్వాయర్‌కు నీరు వచ్చాయన్నారు. యాడికి, పెద్దవడుగూరు మండలాలకు కూడా నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న నీటి నిల్వ ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.60కోట్లు విడుదల చేస్తే ప్రతి ఎకరాకు నీరు అందివచ్చని శుక్రవారం జరిగిన ఐఏబీ సమావేశంలో తెలిపానన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తానన్నారు. మండల కన్వీనర్ తాతిరెడ్డి లోకనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ బీసీ రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మండల తెలుగుయువత ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రిజర్వాయర్ ఏఈ హరినాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ ఎంపికకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఎంపిక కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతకు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇప్పించడానికి ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం అసిస్టెంట్ కలెక్టరు సచిన్‌రహార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుముద, ఆర్టీఓ సమక్షంలో ఇంటర్వ్యూలు చేపట్టారు. మొత్తం 53మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 35మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కుముద తెలిపారు.

బార్లలో ఎమ్మార్పీకే అమ్మితే ఎలా?

● నష్టపోతున్నామని దుకాణదారుల ఆవేదన

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని బార్లలో కూడా ఎమ్మార్పీకే విక్రయిస్తుండటంతో తాము నష్టపోతున్నామని పలువురు మద్యంషాపు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో మద్యంషాపు నిర్వాహకులు చంద్రశేఖర్ నాయుడు, శ్రీనివాసులు, సాయిప్రసాద్, వెంకటరమణ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బార్లలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మార్పీకే మద్యం విక్రయిస్తుండటం, అక్కడే సిట్టింగ్ ఏర్పాటు చేయడంతో మద్యంషాపుల వ్యాపారాలు దెబ్బతింటున్నాయన్నారు. నెలనెలా రూ. 5 లక్షల వరకూ నష్టాల చవిచూడాల్సి వస్తోందన్నారు. పైగా ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యంషాపులకు ఇవ్వాల్సిన 20 శాతం రాయితీ ఇవ్వకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బార్లలో ఎమ్మార్పీతో మద్యం విక్రయాలు జరిపితే నిర్వాహకులు షాపులు మూసేసి తాళాలు ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పేరూరు టీచర్


బహుమతిని అందుకుంటున్న పేరూరు చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై నిర్వహించిన సంపృద్ధి పోటీల్లో శ్రీ రాములు ప్రతిభ చాటారన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగిన పోటీలలో శ్రీరాములు, పూలమతి గ్రామ జడ్పీ స్కూల్ ఉపాధ్యాయురాలు మెరిసిరాణి సంయుక్తంగా ప్రతిభచాటి రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి సాధించారన్నారు. ఈక్రమంలో వీరు నవంబరులో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బస్సు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన కావేరి బస్సు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవరగుడి జగదీష్ డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బస్సు ప్రమాద మృతులకు పార్టీ తరఫున సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షలు, ఏపీ ప్రభుత్వం రూ.5 లక్షలు, ప్రధాని మోదీ రూ.2 లక్షల పరిహారాన్ని ప్రకటించారని, బాధిత కుటుంబాలకు ఈ సొమ్ము ఏమాత్రం సరిపడదని అన్నారు. గతంలో జబ్బార్ బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారని, అదే తరహా పరిహారం ఇవ్వాలని కోరారు. అనుమతులు లేని, కాలం చెల్లిన బస్సులు అనేకంగా తిరుగుతున్నాయని అన్నారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వేగ నియంత్రణకు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. అందుకే ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆర్టీఏ అధికారుల అవినీతి, ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర రవాణా శాఖ మంత్రుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. బెంగుళూరు-హైదరాబాద్ హైవే నిర్వహణ అధ్వానంగా ఉందని, ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు. ఘోర ప్రమాదాలు జరిగినపుడు మాత్రమే అధికారులు, పాలకులు హడావుడి చేసి, ఆ తరువాత వదిలేస్తున్నారని అన్నారు. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో ప్రమాదాల నివారణకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్


బీటీపీ గేటు ఎత్తడంతో విడుదలవుతున్న నీరు

బీటీపీకి పెరిగిన వరద

గుమ్మఘట్ట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువన ఉన్న బీటీపీకి వరద నీరు చేరుతోంది. దాదాపు రెండువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈక్రమంలోనే శనివారం బీటీపీ ఆరో గేటు ఎత్తి 1550 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేవీట్యాంక్ నింపేందుకు ఎడమ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు విడుదల చేశారు. బీటీపీ పూర్తిస్థాయి నీటిమట్టం 1655 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1653 అడుగులకు చేరింది. వరదనీరు పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని విడుల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తుంగభద్రకు నీటి విడుదల


విద్యుత్ కాంతుల్లో టీబీడ్యామ్

కంప్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి శనివారం ఆరు క్రస్ట్‌గేట్లు తెరచి అధికారులు నీరు విడుదల చేశారు. జలాశయం ఎగువన అధిక వర్షాల కారణంగా డ్యామ్‌లో నీటి మట్టం 80 టీఎంసీలకు పైగా చేరింది. దీంతో డ్యామ్ నిపుణుల సలహా మేరకు బోర్డు అధికారులు గేట్లు తెరిచి నీటిని వదిలారు. ఇప్పటికే నదీతీరాన వుండే గ్రామాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాత్రి విద్యుత్ కాంతుల్లో జలాశయం విశేషంగా ఆకట్టుకుంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి: పీడీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెంచిన స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూచించారు. స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం మహాసభ సమావేశాన్ని నిర్వహించారు. పీడీ శైలజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ - గ్రేడ్ గ్రామ సంఘాలకు రూ.75 లక్షల నుంచి రూ.కోటి దాకా రుణ మంజూరు పరిధిని పెంచిందన్నారు. బీ గ్రేడ్ సంఘాలకు రూ.65లక్షల నుంచి రూ.90 లక్షలు, సీ గ్రేడ్ సంఘాలకు రూ.50లక్షల నుంచి రూ.80 లక్షలు, డీ గ్రేడ్ సంఘాలకు రూ.40లక్షల నుంచి రూ.70 లక్షలకు రుణం మంజూరును పెంచినట్లు తెలిపారు. నవంబరు నుంచి పెంచిన రుణాలను గ్రేడ్‌ల ఆధారంగా మంజూరు చేస్తామన్నారు. మండల సమాఖ్యలకు 90 రోజులు దాటిన తర్వాత రూ.20 లక్షలకు మించి బకాయి ఉంటే రుణాన్ని మంజూరు చేసేవారుకాదన్నారు. తాజాగా బకాయి రూ.30 లక్షల వరకు ఉన్నా తిరిగి రుణాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ విషయాలను క్షేత్ర స్థాయిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు తెలియజేసి, అమలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ రాధారాణి, డీపీఎంలు రవీంద్రబాబు, రాజ్యలక్ష్మీ, స్త్రీనిధి ఏజీఎం దయాసాగర్, ఏపీఎం సుభద్రమ్మ, మండల సమాఖ్యల అధ్యక్షులు, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం

● సిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి యాజమాన్యం
● నేడు ఆస్పత్రి ప్రారంభం



అనంతపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని సిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలో కొత్తగా నిర్మించిన ఆస్పత్రిని ఆదివారం ఉదయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులతో 300పడకలతో ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే అందించాలన్న ఉద్దేశంతో ఆస్పత్రిని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఎనిమిది మాడ్యులర్ లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు, వంద పడకల ఐసీయూ సౌకర్యం, 20పడకల నియోనటాల్, పీడియాట్రిక్ ఐసీయూ ఏర్పాటు చేశామన్నారు. 25కు పైగా శస్త్ర చికిత్సలు అందించే సేవలతో పాటు ప్రపంచ స్థాయి డయాగ్నస్టిక్ సేవలు, అత్యాధునికమైన సిమ్స్ 1.5టిఎంఆర్ఐ, 128 స్లైస్ సిటీ స్కానర్, అధునాతన ల్యాబ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలకే వైద్య సేవలు అందిస్తామన్నారు.

న్యూస్ బాక్స్

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్

గాండ్లపెంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాబోవు ఐదు రోజుల వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబురావు శనివారం తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు రాబోవు ఐదు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీని వలన ఆస్తి, ప్రాణ, పంట నష్టాలు జరిగే అవకాశం ఉంటుందని, విపత్తుల సహాయం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే కిరణ్‌కుమార్ జేఏ ఫోన్ నంబర్ 6281690292, గ్రామ సర్వేయర్ రాజశేఖర్ ఫోన్ నంబర్ 9849630124కు సమాచారం తెలియజేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కొత్తచెరువు అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనాథరెడ్డిని విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డీఈఓ క్రిష్టప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉంటూ రాజకీయ సభలు, సమావేశాల్లో పాల్గొనడం, బడికి సక్రమంగా హాజరు కాకపోవడం వంటి ఆరోపణలు ఆయనపై వచ్చాయన్నారు. క్షేత్రస్థాయిలో ఆయన పనితీరుపై విచారణ చేసిన అనంతరం నిజమని రుజువు కావడంతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌టీ వీధిలో ఓ విద్యుత్ స్తంభం 30 ఏళ్లగా విరిగిపోయి ఉంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఈ విషయాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు జబీవుల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సూచనతో విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సిబ్బందిని పంపి విరిగిపోయిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటుచేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రాళ్లపల్లి షరీఫ్, నాయకులు మాధవరెడ్డి, రామకృష్ణ, అనిల్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండల సురేశ్‌బాబు, పట్టణ అధ్యక్షులు చెలిమి శివరాం, నాయకులు నాగేంద్రగౌడ్, జక్కల గంగాధర్, చిన్న పాల్గొన్నారు.

వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు



వడ్డే ఓబన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్లెల ఈశ్వరరావు

కదిరి అర్బన్/ఆమడగూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు పేర్కొన్నారు. ఆయన శనివారం అనంతపురం నుంచి మొలకలచెరువు వెళ్తూ, పట్టణంలోని వడ్డే ఓబన్న విగ్రహానికి వడ్డెర సంఘం స్థానిక నాయకులతో కలసి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర జాతి అభివృద్ధి లక్ష్యంగా తనతో పాటు కార్పొరేషన్ డైరెక్టర్లు పనిచేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వడ్డెరకు మైనింగ్ లీజుల్లో 15శాతం కేటాయించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. వెనుకబడిన వడ్డెర వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు దాణా గంగయ్య, సంఘం నాయకులు పైడిపురం రమణ, అశోక్ కుమార్, నరసింహులు, వెంకటరమణ, హరి, వలిప్ప, గంగరాజు, శ్రీనివాసులు, రత్నమయ్య, చంద్ర, ఆదినారాయణ, గంగాధర్, అంజి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయనను ఆమడగూరు మండల పరిధిలోని మహమ్మదాబాద్‌లో వడ్డెర సంఘం సీనియర్ నాయకుడు నాగరాజు గృహంలో పూలమాల, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు శీన, డేరాకొండ రమణప్ప, క్వారీ నాగరాజు, పెయింటర్ రాము, డెయిరీ శీన, సురేష్, సుధాకర్, వలిప్ప క్రిష్టప్ప, రమణ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

నల్లమాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దోమల నివారణ కోసం సర్పంచ్ రమావత్ భారతి ముందస్తు చర్యలు చేపట్టారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న పెద్ద బ్రిడ్జి ఇరువైపులా మురుగునీరు ఉండటంతో ముళ్ల కంపలు ఏపుగా పెరిగి, దోమలు అధికమయ్యాయి. దీంతో జ్వరాల బారిన పడుతున్నామని, మురికినీరు దుర్వాసన వెదజల్లు తోందని సమీప నివాసులు సర్పంచ్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ బ్రిడ్జి ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. దోమల నివారణ కోసం మురుగునీటి మందు పిచికారీ చేయిస్తామని తెలిపారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నో బ్యాగ్ డే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

తనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీజీ ప్రాజెక్ట్ వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరీ వికాసం.. నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మేరీమార్గరెట్ మాట్లాడుతూ ఆడపిల్లలకు సమాన అవకాశాలు కల్పించి మగ పిల్లలతో సమానంగా ప్రోత్సహించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ.. పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, అమ్మాయిల ఆరోగ్య రవాణా, వివక్ష, పోక్సో యాక్ట్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బాడ్ టచ్, గుడ్ టచ్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమాదేవి, పద్మావతి, శోభ, రెడ్డెమ్మ, భాగ్యమ్మ, వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఓబులదేవరచెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బాలికలకు భౌతిక బారాన్ని తగ్గించాలన్నదే నో బ్యాగ్ డే ఉద్దేశ్యమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ షమీమ్, స్వర్ణ, వెంకట నరసమ్మ, సుకన్య, పార్వతి, ప్రమీళ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే... వెళ్లేదెలా..?

తనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇలా ఉంటే .. గ్రామంలోకి వెళ్లేది ఎలా.. బయటకు వచ్చేది ఎలాగని చిన్నరామన్నగారిపల్లి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలోకి వెళ్లే కూడలి వద్ద వర్షపునీరు నిలిచి బురదమయంగా మారింది. కూడలి మొత్తం బురదమయమై గ్రామంలోకి వెళ్లడానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. నీరు నిలువ ఉండటంతో దోమలు పెరిగి రోగాలబారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తమ సమస్య పరిష్కరించాలని గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేదని తెలిపారు. పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారులు కానీ, ఆరోగ్యశాఖ అధికారులు కానీ తమ గ్రామం వైపు కన్నెత్తిచూసిన పాపాన పోలేదని మండిపడ్డారు. గ్రామంలోకి వెళ్లడానికి వీలుకాని పరిస్థితిలో ఉన్న కూడలిలోని మట్టి తోలి గుంతలను పూడ్చాలని కోరారు.



బురదమయమైన చిన్నరామన్నగారిపల్లిలోకి వెళ్లే కూడలి

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

● 6.10కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



కత్తేకొట్టాలలో భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించిన మంత్రి

ధర్మవరం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని మోటుమర్ల నుంచి కత్తేకొట్టాల వరకు, పోతులనాగేపల్లి మీదుగా కనంపల్లికి, ధర్మవరం రోడ్డు నుంచి చింతలపల్లి, వసంతపురం నుంచి చిగిచెర్ల క్రాస్ వరకు బీటీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.6.10కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆయా రోడ్ల నిర్మాణానికి మంత్రి శనివారం కత్తేకొట్టాల గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి, టీడీపీ నాయకులకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. భూమి పూజ అనంతరం మంత్రి మాట్లాడుతూ... స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఈ గ్రామాలకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రహదారులను త్వరితగతిన పూర్తిచేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిమనోహర్, ఇతర శాఖల అధికారులు, ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాట మయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, బీజేపీ నాయకులు హరీష్ బాబు, మాజీ ఎంపీపీ మద్దిలేటి, టీడీపీ మండలకన్వీనర్ లక్ష్మన్న, విజయ సారథి, గొట్లూరు చంద్ర, ఆదెప్ప, కత్తేకొట్టాల ప్రసాద్, కాటమయ్య, నరసింహులు, కనంపల్లి రాజు, తెలుగుయువత విజయ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ప్రారంభం

● బత్తలపల్లి : మండలపరిధిలోని పత్యాపురం గ్రామంలో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి సత్యకుమార్ శనివారం ప్రారంభించారు. పత్యాపురం నుంచి పత్యాపురం తండా వరకు 1060 మీటర్ల బీటీ రోడ్డును రూ. 85లక్షల వ్యయంతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ రోడ్డును మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి పత్యాపురం తండాకు రోడ్డు లేక పోవడంతో తండా వాసులు చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సర్దలత, సర్పంచ్ రమాదేవి, బీజేపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు వీరనారప్ప, బాస్కర్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే కందికుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. ఆయన శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సోమవారం కదిరి ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్, ఎస్పీ పాల్గొంటారని... నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సుదూరంలోని జిల్లా కేంద్రానికి వెళ్లి సమస్యలు చెప్పుకోలేని వారు ఇక్కడ అధికారులకు తెలపవచ్చన్నారు. అలాగే కదిరి బైపాస్ రోడ్డు పూర్తి చేసేందుకు అధికారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఉన్న అడ్డంకులను తొలగించి బైపాస్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

● గాండ్లపెంట: కదిరి ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాబూరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు తదితరులు వివిధ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు విన్నవించుకోవచ్చని తెలిపారు.

యాప్ ద్వారా మద్యం విక్రయించాలి

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్



సురక్ష యాప్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్, అధికారులు

పుట్టపర్తి రూరల్/ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల్లో, బార్లలో మద్యం సురక్ష యాప్ ద్వారానే అమ్మకాలు జరపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య సూచించారు. నకిలీ మద్యం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు. మద్యం అమ్మకాలు, బెల్ట్‌షాపుల నియంత్రణ, అక్రమ మద్యం అమ్మకాలపై ఆయన శనివారం జిల్లా కేంద్రంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లలో ప్రతి మద్యం బాటిల్‌ను ఎక్సైజ్ సురక్షయాప్ ద్వారానే విక్రయించాలన్నారు. బెల్ట్‌షాపులు నియంత్రించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోకి అక్రమమద్యం చొరబడకుండా నిఘా పెంచాలన్నారు. అనంతరం ఎక్సైజ్ సురక్షయాప్‌ను జిల్లా అధికారులతో కలసి ఆవిష్కరించారు. సమీక్షా సమావేశంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా అధికారి గోవిందనాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారి శ్రీరాం, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆయన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ పనితీరుపై పట్టణంలోని మద్యం దుకాణాల వద్ద అవగాహన కల్పించారు.

ఆల్‌రౌండ్ చాంపియన్‌గా బాలికల పాఠశాల



ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్ సాధించిన కదిరి పాఠశాల విద్యార్థినులు

కదిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆల్ రౌండ్ చాంపియన్ షిప్ గెలుచుకున్నారు. రెండో స్థానంలో ఏపీ ట్రైబుల్ వెల్ఫేర్ పాఠశాల, మూడో స్థానంలో పట్నం పాఠశాల నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలుర విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల మొదటి స్థానం, బ్రహ్మానంద్ పాఠశాల రెండో స్థానం, పట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మూడోస్థానం కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులను బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి అభినందించారు. ఈ క్రీడలను మండల కోఆర్డినేటర్ శంకర్‌నాయక్, పీడీలు యశోద, పద్మ, సుజాత, సంధ్య, దర్మేంద్రనాయక్ తదితరులు నిర్వహించారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు

ధర్మవరం విద్యార్థిని



ఎంపికైన విద్యార్థిని ఉష్మశ్రీ

ధర్మవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు ఎస్కేయూ జట్టుకు ధర్మవరం విద్యార్థిని ఉష్మశ్రీ ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పృథ్వీ తెలిపారు. పట్టణం లోని శాంతినగర్‌కు చెందిన వేణుగోపాల్, సుజాత దంపతుల కుమార్తె ఉష అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 22, 23తేదీలలో అనంతపురంలో ఎస్కేయూ నిర్వహించిన పోటీలలో ఉష్మశ్రీ ప్రతిభ కనబరిచిందన్నారు. సోమవారం నుంచి ఈ నెల 31వతేదీ వరకు తమిళనాడులోని వినాయక యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొనబోతున్నారు. ఈ విద్యార్థిని ఉష్మశ్రీని కోచ్ పృథ్వీ, ఆర్టీఓ ఏటీఎల్ శ్రీనివాసులు, రాజశేఖర్, అనిల్ అభినందించారు.

రెవెన్యూ ఉద్యోగుల కమిటీల ఎన్నిక



కలెక్టరేట్ ఉద్యోగుల కమిటీ సభ్యులు

పుట్టపర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ కమిటీని కలెక్టరేట్‌లో శనివారం ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా 12 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలెక్టరేట్ ఏఓ ఆర్ వెంకటనారాయణను అధ్యక్షుడిగా, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె. శ్రీకాంత్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నామని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ షేక్ మైనుద్దీన్ శనివారం తెలిపారు. అదేవిధంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో 12 మందితో కూడిన పుట్టపర్తి డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె. నరసింహులు, ట్రెజరర్‌గా గణేష్‌రెడ్డి, సెక్రటరీగా మనోజ్‌కుమార్‌రెడ్డిలతో పాటు జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు నాగార్జున శెట్టి, శ్రీనివాసులురెడ్డి, మైనుద్దీన్ తెలిపారు.

ధర్మవరం రూరల్: రెవెన్యూ ఉద్యోగుల ధర్మవరం కమిటీని శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్డీఓ కార్యాలయం ఏఓ జబీఉన్‌ కుప్తా, సెక్రటరీగా పణ్యుత్ కుమార్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా బాస్కర్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాలకు రెవెన్యూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

సోలార్‌తో జీవనోపాధి కోల్పోతాం

● సర్వే బృందంతో గురికానివారిపల్లి గ్రామస్తులు



సర్వే బృందంతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

నంబులపూలకుంట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సోలార్ నిర్మాణానికి భూములు సేకరిస్తే జీవనోపాధి కోల్పోతామని మండలంలోని గురికానివారిపల్లి గ్రామస్తులు సర్వే బృందంతో వాగ్వాదానికి దిగారు. మండలంలోని వంకమద్ది పంచాయతీ గురికానివారిపల్లిలో శనివారం సర్వే బృందం పర్యటించింది. సోలార్‌కు భూములు ఇచ్చిన రైతుకు గుత్త చెల్లిస్తారని వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గురికానివారి పల్లి, పెదరామయ్యగారిపల్లి, వంకమద్ది గ్రామాల ప్రజలు దరా పశు పోషణపైనే ఆధారపడ్డామన్నారు. ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను పశువుల మేపు కోసం వాడుకుంటున్నామని, వాటిలో సోలార్ ఏర్పాటుచేస్తే గ్రామాలు వదిలి వలస వెళ్లక తప్పదన్నారు.

వడ్డెర సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

ఓబులదేవరచెరువు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వడ్డెర సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక వెంకటసాయి ఐటీఐలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపేటి అంజినప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వలిపి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా జెరిపేటి వెంకటేష్, గౌరవాధ్యక్షుడిగా బి.శ్రీనివాసులు, గౌరవ ఉపాధ్యక్షుడిగా డి. శివప్ప, కార్యదర్శిగా దండుగల ఈశ్వరయ్యను ఎన్నుకున్నారు. అలాగే సహకార్యదర్శిగా పి. నాగభూషణం, కోశాధికారిగా జే. శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా రమణప్ప, అశోక్, రవిని ఎన్నుకున్నారు.

విద్యార్థుల శ్రేయస్సుకు కృషి : మంత్రి



ఎంపికైన విద్యార్థులకు ధ్రువ పత్రాలను అందజేస్తున్న మంత్రి

ధర్మవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శ్రేయస్సుకు కృషి చేస్తున్నామని, ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించాల్సిందే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఈ నెల 16న సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గురురామచంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ సహకారంతో స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శిక్షణ అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరచిన 12 మంది విద్యార్థులు ఎంపిక కాగా బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో ఉచితంగా శిక్షణ పొందే అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. వారికి శనివారం మంత్రి చేతులమీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. సంస్కృతి సేవాసమితి కార్యదర్శి ఒంటెరు శ్రీనివాసరెడ్డి, గురు రామచంద్ర కోచింగ్ సెంటర్ త్రయేవేల్ రెడ్డి పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా : ఏఈ

ధర్మవరంరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎడాపెడా విద్యుత్‌కోతలతో మండలంలోని ఉప్పనేసినపల్లి వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షం వస్తే చాలు కరెంట్ సరఫరా లో అంతరాయం ఏర్పడుతోందని, బోరుబావులకు కూడా రెండుమూడు రోజులైనా కరెంట్ సరఫ రా కావడంలేదని శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఎడాపెడా విద్యుత్‌కోతలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు గ్రామానికి పరుగులు తీశారు. ఏఈ జానకీరామయ్య, లైన్‌మ్యాన్‌లు కలిసి గ్రామంలోని పరిసర ప్రాంతాలను, లైన్‌లను పరిశీలించారు. విద్యుత్‌స్తంభాల వద్ద ఉన్న సమస్యలను పరిష్కరించారు. గ్రామస్తులు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు. విద్యుత్ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి స్పందన

29న కదిరిలో జాబ్‌మేళా

కదిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ నాగార్జున శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ కంపెనీలు ఈ జాబ్‌మేళా పాల్గొంటాయని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దౌర్జన్యం చేసి కొట్టారని ఫిర్యాదు

నల్లమాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సర్పంచ్ భర్త నాగరాజు, ఆతడి తమ్ముడు శివ తనపై దౌర్జన్యం చేసి కొట్టారని మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జయశంకర్ ఫిర్యాదు చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు. జయశంకర్ ఇంటికి పంచాయతీ కొళాయి వేసేందుకు ఆయన వద్ద పని చేస్తున్న డ్రైవర్ నరసింహులు కాలువ తీస్తుండగా సర్పంచ్ భర్త నాగరాజు, తమ్ముడు శివ వచ్చి అడ్డుకున్నారు. ఎవరిని అడిగి కొళాయి వేస్తున్నారని ప్రశ్నించారు. అయితే పంచాయతీలో ఇంటింటికి కొళాయి వేస్తారు కదా... అలాగే కొళాయి వేసుకుంటున్నామని జయశంకర్ సమాధానమిచ్చారు. వెంటనే వారిరువురు తనపై దాడి చేసి కొట్టారని జయశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. జయశంకర్ ఫిర్యాదు మేరకు నాగరాజు, శివపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతు కష్టం వానపాలు



నల్లగా మారిన వేరుశనగకాయలు

ధర్మవరం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి, ఆరుగాలం కష్టపడి పండించిన పంట మూడురోజులుగా కురిసిన వర్షానికి పూర్తిగా తడిసి ముద్ద అయింది. వేరుశనగకాయలతో పాటు పశువుల మేత కూడా నల్లగామారి ఆ రైతును నిండాముంచింది. మండలంలోని దర్శినమల గ్రామానికి చెందిన రైతు నారాయణ, లక్ష్మీనారాయణమ్మ కుటుంబం నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని బోరుబావి కింద వేరుశనగను పంట సాగుచేశారు. పంట సాగుకోసం సుమారు రూ. 2లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. పంటకు రాత్రింబవళ్లు నీటి తడుపులు, రసాయనిక మందులు పిచికారీ, కూలీల ఖర్చులకు పెట్టుబడి పెట్టారు. నాలుగు నెలలు పూర్తికావడంతో దిగుబడి రావడంతో పంటను తొలగించారు. తొలగించిన రాత్రి నుంచే వర్షం కురవడంతో పంటంతా తోటలోనే తడిసి ముద్ద అయి కుళ్లిపోయింది. దీంతో ఏమిచేయ లేక ఆ రైతు కుటుంబం బోరుమని విలపించింది. కౌలుకు తీసుకుని పంటను సాగుచేశామని, రేయింబవళ్లు చేను దగ్గరే పడిగాపులు కాచి పండించుకున్నాం... తీరా పంట చేతికొచ్చేసమయంలో వాన వచ్చి చేతికందకుండా పోయిందని ఆ రైతుకుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రతి ఏడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా చేతికొచ్చిన పంటలు నష్టపోవడంతో అప్పులపాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





నల్లగా మారిన వేరుశనగను చూపుతున్న రైతు దంపతులు

విద్యార్థులు మొక్కలను పెంచాలి

●అటవీశాఖ అధికారి

కదిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్కలను పెంచాలని అటవీశాఖ అధికారి గుర్రప్ప తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 'అడవుల రక్షణ, వన్య ప్రాణుల సంరక్షణ' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అడవుల పట్ల అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లియాఖత్ అలీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దత్తత తీసుకుని పెంచాలన్నారు. మొక్కలను పెంచడం వల్ల వాతావరణంలో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు ప్రదీప్‌కుమార్, దామోదర్, రాయసం హరిప్రసాద్, అటవీశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కాశీ విశ్వేశ్వరుడికి పూజలు



పెనుకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి



ట్రాక్టర్ యజమానులతో గొడవ పడుతున్న ఇరిగేపల్లి రైతులు

అగళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలం ఇరిగేపల్లి సువర్ణముఖి నది వద్ద ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని ఆ గ్రామ రైతులు ట్రాక్టర్‌లో ఇసుక తోలుతున్న యజమానులను అడ్డుకున్నారు. మా పొలాలకు ఆనుకుని ఇసుకను తోలుతున్నారని, దీంతో భూములు పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి మాభూములకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, ఫౌండేషన్ సభ్యులు

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోళ్లాపురంలో ట్రైసైకిళ్లు, వాకింగ్‌స్టిక్‌లు పంపిణీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి సూర్య ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

పార్టీ ఆదేశాలను ధిక్కరించను: ఆవులరెడ్డి

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇకపై పార్టీ ఆదేశాలను ధిక్కరించనని శనివారం టీడీపీ నాయకుడు ఆవులరెడ్డి అన్నారు. ఇటీవల లేపాక్షి ఎన్టీఆర్ విగ్రహంవద్ద ఆయన తెలుగుదేశం నాయకులకు సంబంధించి కొన్ని ఆరోపణలు చేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి చేసిన తప్పును క్షమించాలని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రను కోరారు. ఆ రోజు మద్యం తాగి అలా మాట్లాడానని, మొదటి తప్పుగా భావించి క్షమించాలని లిఖితపూర్వకంగా కోరారు.

విరుపసముద్రం రోడ్డు పరిశీలన

అమరాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి విరుపసముద్రం కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డును ఆర్ అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవయ్య శనివారం పరిశీలించారు. తాత్కాలిక రోడ్డు మరమ్మతు పనులు చేయడానికి అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కాంట్రాక్టర్ పనులు చేయకుండా వదిలేసిన రోడ్డు పనులను టెండర్ ద్వారా పనులు ప్రారంభించడానికి కృషిచేస్తామని వారు తెలిపారు. క్లాస్‌వన్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, నాగరాజు, శివరుద్రప్ప పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ



కార్మికులకు చెక్కులు పంపిణీ చేస్తున్న న్యాయాధికారి కంపల్లె శైలజ

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్థికపరంగా మహిళలు ఎదగాలని జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. శనివారం పరిగి ఇండియన్ గార్మెంట్స్‌ను న్యాయాధికారి పరిశీలించి మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కుటుంబం అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే మహిళలపాత్ర ఎంతో ఉందని పారిశ్రామిక వేత్తలు పలు కంపెనీల ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. కంపెనీ యాజమాన్యం నమ్మకాన్ని వొమ్ము చేయకుండా అభివృద్ధి సాధించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఇతర వ్యక్తులు చెప్పే ఆకర్షనీయమైన మాటలకు దూరంగా ఉండాలన్నారు. ఓవైపు ఆర్థికాభివృద్ధి, మరోవైపు కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ జీవనాన్ని సాగించాలన్నారు. ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతియేటా మహిళల కుటుంబానికి అందించే ఆర్థిక సాయాన్ని 110మంది విద్యార్థులు రూ.9లక్షలను న్యాయాధికారి చేతులమీదుగా కంపెనీ నిర్వాహకులు మహిళా కార్మికులకు అందించారు. కార్యక్రమంలో గార్మెంట్స్ డీజీఎం సురేష్, సీనియర్ మేనేజర్ శామ్యూల్, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతోష్ కుమారి, నవేర, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, చంద్రకాంత్ పాల్గొన్నారు.

వైసీపీపై నమ్మకం లేకనే టీడీపీలోకి వలసలు

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీపై నమ్మకం సన్నగిల్లి తెలుగుదేశం పార్టీవైపు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చూస్తున్నారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో వై.బి.హళ్లి వైసీపీ ఎంపీటీసీతో పాటు పలువురు నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుపైనే ఉందని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే సీఎంగా ఆయనుంటేనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. వైసీపీకి మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. వై.బి.హళ్లి ఎంపీటీసీ రంగనాథ్, మణూరు ఎంపీటీసీ సునీత, ఛత్రం ఎంపీటీసీ కె.హనుమంతరాయుడు, టీడీపల్లికి చెందిన తుకారాంతో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరారు. అందరికీ ఆయన పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మండల కన్వీనర్ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శులు మారుతీరెడ్డి, తిమ్మరాజు, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

ఘనంగా వాల్మీకి జయంతి

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల గ్రామంలో వాల్మీకి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి వాల్మీకి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మండల కన్వీనర్ నాగరాజు పాల్గొన్ని వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు చేశారు.

రేపు ఎమ్మెల్యేల రాక

రొళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలం రత్నగిరికి సోమవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, బస్ షెల్టర్‌కు భూమిపూజ కార్యక్రమానికి 20మంది ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు వన్నప్ప, పాళెం కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బేగార్లపల్లి గ్రామంలో భారీ బహిరంగ సభకూడా ఉంటుందని తెలిపారు. హులికుంట పంచాయతీ అధ్యక్షుడు నారాయణప్ప, బాలకృష్ణ, మూర్తి, నాగరాజు, నాగప్ప, చిక్కనరసప్ప పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

పెనుకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం నిర్వహించే మహాధర్నాని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సహకార సంఘం సొసైటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు విజయవాడలోని ఆప్కాబ్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆఫీస్‌కు తాళాలు వేసి కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

కళాకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

పెనుకొండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆదరణ నోచుకోక కనుమరుగవుతున్న కళాకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని పెనుకొండ ఘనగిరి కృష్ణదేవరాయ నాటక కళాసమితి సభ్యులు కోరారు. శనివారం స్థానిక లలిత కళాపరిషత్‌లో అంతర్జాతీయ నాటక కళాకారుల దినోత్సవాన్ని నిర్వహించారు. కేక్‌కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. సభ్యులు కోనాపురం ఈశ్వరయ్య, నారాయణస్వామి, కోగిర జయచంద్రారెడ్డి, హార్మోనిస్ట్ రవికుమార్, నారాయణ, చెన్నప్ప, వెంకటేశ్, రామాంజనేయులు, టైలర్ బాబయ్య పాల్గొన్నారు.

ఓబన్న విగ్రహావిష్కరణకు తరలిరండి

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గోరంట్లలో ఆదివారం చేపట్టనున్న వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వడ్డెర సంఘం నాయకులు తరలిరావాలని వడ్డె మురళీ పిలుపునిచ్చారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర సంఘం జిల్లా, రాష్ట్ర నాయకులతోపాటు మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిపల్లికి చెందిన రవి, గంగరత్నమ్మ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు రవి, గంగరత్నమ్మ పనినిమిత్తం సోమందేపల్లికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా పాపిరెడ్డిపల్లివద్ద రోడ్డు దాటడానికి వాహనాన్ని ఆపారు. వెనుకే వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. గంగరత్నమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అగళి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలం ఎంఎంపాళెం గ్రామానికి చెందిన మహేష్(55) బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన మేరకు గత వారం మహేష్ తన మిత్రులతో కలిసి మంత్రాలయం వెళ్లాడు. అక్కడి నుంచి వస్తుండగా లారీ, కారు ఢీకొని ఇరువు గాయపడ్డారు. మహేష్ తలకు బలమైన గాయాలుకాగా బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మహేష్‌కు భార్య మమత, కుమారుడు ఉన్నారు. ఇరుయూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాన్ని వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన వాహనం

సోమందేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్రాయనపల్లివద్ద జాతీయరహదారి పక్కన హోండా యాక్టివా వాహనాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వాహనం ముందు భాగం డ్యామేజ్ అయిందని ఐదురోజులుగా ఇక్కడే ఉందన్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంట్లో చోరీ

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దండురోడ్డులో నివాసముంటున్న రవికుమార్ ఇంట్లో చోరీ జరిగినట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. రవికుమార్ కుటుంబ సభ్యులు తమిళనాడుకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి తలుపులు వేసి ఉండగా చోరీ జరిగింది. పక్కింటివారు పోలీసులకు సమాచారం ఇవ్వగా పుట్టపర్తి నుంచి క్లూస్ టీమ్ రప్పించి పరిశీలించారు. ఇంట్లో ఉన్న ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రవికుమార్ శనివారం రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సడ్లపల్లి, ఆటోనగర్‌కు సంబంధించి 160కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ చైర్మన్‌రమేష్ శనివారం ప్రారంభించారు. 14లక్షల వ్యయంతో రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత, ఏఈ లక్ష్మీకాంత్, టీడీపీ నాయకులు వెంకటేశ్‌రెడ్డి, రామన్న, నారాయణప్ప, లింగారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి సోమవారం పీజీఆర్ఎస్: మున్సిపాలిటీలో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఉదయం 10గంటల నుంచి పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం ఉంటుందన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీటీ రోడ్డుకు నిధుల మంజూరు

రొళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డేరి-పిల్లిగుండ్ల బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరైనట్లు పీఆర్ డీఈ వెంకటేశులు తెలిపారు. గ్రామంలో రూ.1.20కోట్ల పనులను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి దొడ్డేరి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకం అవసరం



మొక్కను నాటి నీరుపోస్తున్న విద్యార్థినులు

పెనుకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మానవజాతి మనుగడకు మొక్కలు పెంచడం అవసరమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, అటవీ శాఖ బీట్‌ఆఫీసర్ గౌతమి అన్నారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో కార్తీక మాసం వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడం అందరి బాధ్యత అన్నారు. కార్తీక మాసంలో మొక్కలు నాటడంవల్ల వర్షాలు అధికమై బాగా పెరుగుతాయన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలునాటి నీరు పోశారు. అధ్యాపకులు బషీర్‌అహ్మద్, ఎంఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీలేఖ, శివన్న, రవికుమార్, ఆర్ఆర్‌సీ నోడల్ అధికారి విజయప్రకాష్ పాల్గొన్నారు.

రేపు చాకర్లపల్లి గేటు మూసివేత

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకర్లపల్లివద్ద రైల్వేగేటు ట్రాక్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే సెక్షన్ ఇంజనీర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు రెవెన్యూ, ఆర్టీసీ, పోలీసువారికి కాపీలను అందించారు. ప్రయాణికులు జాతీయరహదారిగుండా ప్రయాణించాలని ఆయన సూచించారు.



కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

మంత్రి సమక్షంలో టీడీపీలోకి చేరిక

పెనుకొండ టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలానికి చెందిన పది మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత వీరికి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి సవిత ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చినట్లు తెలిపారు. శ్రీనాథ్‌చౌదరి, మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరహరి, నరసింహులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రొద్దం(ఆంధ్రజ్యోతి): పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన త్రివేణి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధికి దరఖాస్తుచేసుకోగా మంత్రి సవిత ఆమెకు చెక్కును అందించారు. శనివారం పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన నేసె వెంకటరాముడుకు రూ.56,441 చెక్కును మంత్రి అందించారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి భవన్, కన్వీనర్ నరహరి, సర్పంచ్ మంజు, వీరాంజనేయులు, బాషా పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను త్వరగా పూర్తి చేయాలి

● అఖిలపక్ష నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

మడకశిర టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వెనకబడిన ప్రాంతం పెనుకొండలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను త్వరితగతిన ప్రభుత్వమే పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి డిమాండ్ చేశారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం రూ.500 కోట్లను మంజూరుచేసి పెనుకొండలో సత్వరం మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించాలని కోరారు. పీపీపీ పద్ధతిన ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రైవేట్ మెడికల్ కళాశాలలు వస్తే పేద విద్యార్థులపై ఫీజుల భారం పడుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మూర్తి, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు, ఎస్ఎఫ్ఐ వీరేష్ పాల్గొన్నారు.

'పారిశ్రామికవాడను అభివృద్ధి చేసుకుందాం'



మొక్కను నాటుతున్న పరిశ్రమల యజమానులు

హిందూపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలోని ఎన్టీఆర్ పారిశ్రామికవాడను అభివృద్ధి చేసుకుందామని పారిశ్రామికవాడ యజమానుల సంఘం అధ్యక్షుడు మూర్తి, శ్రీనివాసరావు అన్నారు. శనివారం పారిశ్రామికవాడలో అన్నివీధుల్లో కంపచెట్ల తొలగింపు, గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. పారిశ్రామికవాడలో గుంతలు పడ్డ రోడ్లు సర్వేచేసి త్వరలోనే నూతన రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుడతామని ఏపీఐఐసీ అధికారులు ఈశ్వర్, శంకర్ తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్, బాబు, అరుణ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా చేపట్టాలి

మడకశిర టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తే చేర్పులు, మార్పులకు అవకాశాలు తక్కువగా ఉంటుందన్నారు. ముందుగానే పార్టీల నాయకులు ఓటరు జాబితాలో లోటుపాట్లు లేకుండా సిద్ధం చేసేందుకు సహకరించాలన్నారు. వచ్చే సమావేశంలో మీరు మా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అన్ని మండలాల తహసీల్దార్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రెండో వార్షిక మహాసభ

అమరాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హేమ మండల సమైక్య భవనంలో శనివారం రెండో వార్షిక మహాసభను రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 2025-26ఆర్థిక సంవత్సర లావాదేవీలు, ఆడిటర్ నియామకం, ప్రణాళిక బడ్జెట్ ఆమోదం, పాలవకవర్గ సభ్యుల హాజరు, లావాదేవీలపై చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎం ముత్యాలప్ప మాట్లాడుతూ 110 రైతు సంఘాలున్నాయని, 1484మంది రైతు ఉత్పత్తిదారులున్నారని, 4228.19వేల ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. ఎఫ్‌పీఓలు దేవరాజు, శ్రీనివాసులు, సీసీలు భాస్కర్, వీరేష్, నాగరాజు, గోపాల్, ఎంఎస్ అకౌంటెంట్ వరలక్ష్మీ, కెంచమ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

గుడిబండ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని సిటీ, ఐఒ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బూదిపల్లి గ్రామానికి చెందిననాగమణి, శ్రీరామప్ప సాగుచేసిన ఒక్కతోటలను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో పంట సాగుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రాం అధికారులు నరేంద్ర, నవీన్, రమేష్, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం: సీడీపీఓ

సోమందేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ శాంతలక్ష్మి అన్నారు. శనివారం కిశోర బాలికలకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్, విజ్ఞాన్ పాఠశాలల విద్యార్థులు, కరస్పాండెంట్ మల్లికార్జున, హెచ్ఎం క్రిష్ణవేణి, పీటీ అలివేలమ్మ, సూపర్‌వైజర్లు శుభారాణి, డీసీపీఓ కౌన్సిలర్ శివలత, మహిళా కార్యదర్శులు ఉషా, సుమ, ప్రియ పాల్గొన్నారు.

అమరాపురం: కిశోర బాలికలకు కిశోరీ వికాసంపై శనివారం సూపర్‌వైజర్ సన్నమ్మ, హెచ్ఎం రవీంద్ర విద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్థానిక జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశ వర్కర్లు, అంగనవాడీలుఅనసూయ, నాగవేణి, రాజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

మడకశిర టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. యూపీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో హరేసముద్రం పాఠశాల విద్యార్థిని సిరివెన్నెల మొదటి స్థానంలో నిలిచింది. క్విజ్ పోటీల్లో ఆమిదాలగొంది పాఠశాల విద్యార్థిని ఎం.మాన్విత, వక్తృత్వపు పోటీల్లో హరేసముద్రం పాఠశాల విద్యార్థిని సి.ఆర్.సిరీష నియోజకవర్గం స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 29, 30వ తేదీలలో నియోజకవర్గం స్థాయిలో ఐదు మండలాల పరిధిలోని విద్యార్థులు పాల్గొంటారని ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు.

హిందూపురం (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మన దేశ రాజ్యాంగాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఎంఈఓ గంగప్ప అన్నారు. భారతరాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారు 29న నియోజకవర్గస్థాయి పోటీలు ఎంజీఎం పాఠశాలలో జరుగనున్నట్లు తెలిపారు.



మడకశిరలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



పురంలో విద్యార్థులతో ఎంఈఓ, హెచ్ఎంలు